హరోంహర


ప్రొద్దుటూరులో ఆకట్టుకుంటున్న అమృతేశ్వరస్వామి విగ్రహం

ప్రొద్దుటూరు కల్చరల్ : మహా శివరాత్రిని పురస్కరించుకుని పట్టణంలోని పలు ఆలయాలు ముస్తాబయ్యాయి. ముక్తి రామలింగేశ్వరస్వామి ఆలయం, అగస్త్యేశ్వరస్వామి ఆలయం, హనుమత్ లింగేశ్వర స్వామి ఆలయం, అమృతేశ్వరస్వామి తదితర ఆలయాలను విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. ఉదయం స్వామివారికి విశేష అభిషేకాలు, అర్చనలతోపాటు ప్రత్యేక అలంకరణ చేయనున్నారు. శనివారం శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. రాత్రి లింగోద్భవ సమయంలో మహన్యాసపూర్వక రుద్రాభిషేకం చేయనున్నట్లు, భక్తులు కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆలయాల నిర్వాహకులు కోరారు.

ఘనంగా ముందస్తు శివరాత్రి వేడుకలు

స్థానిక జయనగర్‌లోని నారాయణ పాఠశాలలో శుక్రవారం ముందస్తు శివరాత్రి వేడుకలను నిర్వహించారు. శివరాత్రి ప్రాముఖ్యతను ఉపాధ్యాయులు వివరించారు. విద్యార్థుల వేషధారణ అందరిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఏజీఎం చెన్నకేశవరాజు, ఆర్‌ఐ నజీర్, ప్రిన్సిపాల్ హుసేన్, శివ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజుపాళెం : మండలంలోని శివాలయాలు మహాశివరాత్రి పండుగకు ముస్తాబయ్యాయి. పుణ్యక్షేత్రమైన వెల్లాల లోని పురాతన భీమలింగేశ్వర స్వామి ఆలయంలో శనివారం మహాశివరాత్రి సందర్భంగా సాయంత్రం గంగా గౌరి సమేత భీమలింగేశ్వర స్వాముల కల్యాణం నిర్వహించనున్నామని ఆలయ చైర్మన్ కానాల విజయలక్ష్మి, ఈఓ నరసయ్య తెలిపారు. అలాగే కుందూనది ఒడ్డున వెలసిన పురాతన సోమేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయనున్నారు.

ముస్తాబైన శివాలయాలు

కాశినాయన : మహాశివరాత్రి పండుగ సందర్భంగా మండలంలోని కత్తెరగండ్ల శివాలయం, అక్కంపేట శ్రీవిభూది నాగలింగేశ్వర శివాలయాలు ముస్తాబయ్యాయి. కత్తెరగండ్ల శివాలయాన్ని జనమేజయ రాజు ప్రతిష్టించారు. అలాగే అక్కంపేట విభూది నాగలింగేశ్వర శివాలయాన్ని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి విభూదితో ప్రతిష్టించారని చరిత్రలు చెబుతున్నాయి. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శనివారం తెల్లవారుజామున 5 గంటల నుంచి ప్రత్యేక పూజలు ప్రారంభమవుతాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తులకు ఉచిత భోజన వసతి కల్పించారు.

నాగనాథేశ్వర కొండపై..

ఖాజీపేట : భక్తుల కొంగు బంగారం కోరిన కోర్కెలు తీర్చే దైవం నాగనాథేశ్వరుడు. ప్రతి ఏటా మహాశివరాత్రి పండుగ పురస్కరించుకుని కొండ పైకి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారు. అందుకోసం దేవాదయ శాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా మంచినీటి సౌకర్యంతోపాటు దర్శనం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కొండ దిగువన ఖాజీపేట మాజీ సర్పంచ్ మాకం రామకృష్ణయ్య ఆధ్వర్యంలో సత్య హరిశ్చంద్ర డ్రామా ఏర్పాటు చేశారు. అలాగే వచ్చిన భక్తుల కోసం అన్నదానం నిర్వహించనున్నారు.

నేడు గొడ్లవీడులో శివపార్వతుల కల్యాణం

బ్రహ్మంగారిమఠం : మండలంలోని గొడ్లవీడు గ్రామ సమీపంలో ఉన్న పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం మహాశివరాత్రి సందర్భంగా సిద్దు లింగారెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు శివ పార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు గ్రామోత్సవం, రాత్రి 9గంటలకు హరిచందన కోలాటం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గొడ్లవీడు సుబ్రమణ్యం ఆచారి, కార్యకర్త బి.వెంకటరెడ్డి, గ్రామస్తులు పాల్గొననున్నారు.

దూదెమ్మకోనలో..

మండలంలోని మల్లేపల్లె పంచాయతీ లింగాలదిన్నె పల్లె సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న దూదెమ్మకోనలో మహాశిరాత్రి ఉత్సవాన్ని నిర్వహిస్తునట్లు కార్యనిర్వాకుడు భూమిరెడ్డి కృష్ణారెడ్డి తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా రాత్రికి ఉత్సవాలు, అన్నదానాలు, భజనలు నిర్వహిస్తామన్నారు.

అల్లాడుపల్లె వీరభద్ర స్వామి దేవస్థానంలో..

చాపాడు : పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి శిల్పించి, ప్రతిష్టించిన అల్లాడుపల్లె వీరభద్రస్వామి ఆలయం భక్తుల కోర్కెలు తీర్చే దివ్య క్షేత్రంగా విరాజిల్లుతోంది. అల్లాడుపల్లెలో ఏటా వేలాది మంది భక్తుల నడుమ మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. వీరభద్రుడి సన్నిధిలో శని, ఆదివారాల్లో మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ శ్రీనివాసులు, చైర్మన్ జీటీ వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. శనివారం తెల్లవారుజాము 3గంటల నుంచి ప్రత్యేక పూజలు సాయంత్రం 5 గంటలకు వరకూ ప్రత్యేక పూజా కార్యక్రమాలు, జాగరణ సందర్భంగా రాత్రి 8గంటలకు వందన డ్యాన్స్ అకాడమి వారి సాంస్కృతిక కార్యక్రమాలు, నెల్లూరు శ్రీ రాగాస్ ఆర్కెస్ట్రా వారితో సంగీత విభావరి, రాత్రి 8.30 గంటలకు చెక్క భజన, లక్ష్మీపేట గ్రామస్తుల ఆధ్వర్యంలో కోలాటం, అనంతరం రాత్రి 12.30గంటల తర్వాత వీరభద్రస్వామి గ్రామోత్సవం, జ్యోతుల ఉత్సవం నిర్వహించనున్నారు.

రేపు రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు..

మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా వీరభద్ర స్వామి సన్నిధిలో ఆదివారం మధ్యాహ్నం 1గంట నుంచి రాష్ట్రస్థాయిలో వృషభరాజములచే బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన ఎడ్ల ఎజమానులకు రూ.1,00,116, రూ.70,116లు, రూ.60,116లు, రూ.40,116లు, రూ.20,516లు, రూ.12,116లు, రూ.5,116ల చొప్పున నగదు బహుమతులు అందజేయనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

క్లుప్తంగా

ఎరువుల దుకాణాల తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

మైదుకూరు : మైదుకూరు పట్టణం, మండలంలో శుక్రవారం వ్యవసాయాధికారులు ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. మైదుకూరులో మూడు, మండలంలోని జీవీ సత్రంలో మూడు దుకాణాల్లో స్టాక్ రిజిస్టార్లు, లైసెన్స్‌లు, అమ్మకపు రికార్డులను తనిఖీ చేసి మూడు దుకాణాల్లో కొన్ని ఉత్పత్తులకు విక్రయాలను నిలిపివేయాల్సిందిగా నోటీసులిచ్చారు. రైతులకు నాణ్యమైన ఉత్పత్తులను అమ్మాలని, బిల్లులు అందజేసి వారి పూర్తి వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. తనిఖీలో బద్వేలు ఏడీఏ నాగరాజు, మైదుకూరు ఏఓ పి.లక్ష్మిప్రసన్న పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రొద్దుటూరు : వైఎస్సార్ ఇంజనీరింగ్ కాలేజి ఆఫ్ యోగివేమన యూనివర్సిటీ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి శుక్రవారం పరిశీలించారు. రూ.66 కోట్లతో మంజూరైన ఈ పనులు గత నెలలో ప్రారంభమయ్యాయి. ఎక్కడెక్కడ ఏ ఏ భవనాలు నిర్మిస్తున్నారు, ఏఏ వసతులు కల్పిస్తున్నారని ఎమ్మెల్యే అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణ పనులను పరిశీలించారు.

21న ధర్నా చేస్తాం

ప్రొద్దుటూరు : బాధితురాలికి మద్దతుగా ఈనెల 21న వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఐద్వా జిల్లా కార్యదర్శి ముంతాజ్ బేగం తెలిపారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పద్మావతి అనే మహిళకు సంబంధించి కుటుంబ సభ్యులు అన్యాయం చేశారన్నారు. ఈ విషయంపై పోలీసు అధికారుల చుట్టు తిరిగినా న్యాయం జరగలేదని తెలిపారు. సమావేశంలో ఐద్వా నాయకులు వెంకటసుబ్బమ్మ, సర్వేశ్వరి, రాములమ్మ పాల్గొన్నారు.

23న మండల సమావేశం

మైదుకూరు : మైదుకూరు మండల సర్వసభ్య సమావేశం ఈనెల 23న నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ కె.కుళ్లాయమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు జరిగే ఈ సమావేశంలో మండల అభివృద్ధిపై శాఖలవారీగా సమీక్షించనున్నట్టు పేర్కొన్నారు. సమావేశంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొనాలని కోరారు.

20న దువ్వూరులో..

దువ్వూరు : మండల సర్వసభ్య సమావేశం ఈనెల 20న ఉదయం 10.30 గంటలకు మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ సభా భవనంలో ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జగదీశ్వరరెడ్డి శుక్రవారం తెలిపారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు.

దుస్తుల పంపిణీ



పోరుమామిళ్ల : మండలంలోని టేకూరుపేట, కవలకుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, తోమాస్‌రెడ్డి దంపతులు ఉచితంగా దుస్తులను అందజేశారు. వాటిని సంస్థ ప్రతినిధులు ప్రసాదరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి విద్యార్థులకు పంపిణీ చేశారు.

శివయ్యను తాకిన సూర్యకిరణాలు



పోరుమామిళ్ల : పట్టణంలోని శ్రీబాలాత్రిపుర సుందరీదేవి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం సూర్యకిరణాలు శివలింగాన్ని తాకడంతో శివయ్య దేదీప్యమాన ప్రకాశంగా వెలుగొందారు. శివరాత్రి పర్వదిన సందర్భంగా సూర్యకిరణాలు స్వామిని తాకడంతో దర్శించుకున్నామని భక్తులు తెలిపారు.

ఆధ్యాత్మిక సభ నిర్వహణకు సహకరించండి

ప్రొద్దుటూరు : స్థానిక జమ్మలమడుగు బైపాస్ రోడ్డులో అంజుమన్ అహ్లె ఇస్లాం ఆధ్వర్యంలో మార్చి 4, 5 తేదీల్లో నిర్వహించే ఆధ్యాత్మిక సభకు సహకరించాలని శుక్రవారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని అంజుమన్ అహ్లె ఇస్లాం కమిటీ సభ్యులు కోరారు. ఈ సభలకు కర్నూలు, నెల్లూరు, హైదరాబాద్ ప్రాంతాల నుంచి ముస్లిం మత పెద్దలు ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. పారిశుధ్యం, తాగునీటి సౌకర్యం కల్పించాలని విన్నవించారు. రెండు రోజులపాటు నిర్వహించే ఈ సభలకు అన్ని ఏర్పాట్లు చేయిస్తానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. అంజుమన్ అహ్లె ఇస్లాం కమిటీ ప్రతినిధులు బొల్లవరం బాషా, ఆర్టీసీ బాబా, హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు ప్రతిష్ట కోసమే సీబీఐ విచారణ కోరా

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ప్రఖ్యాతిగాంచిన ప్రొద్దుటూరు నియోజకవర్గ ప్రతిష్ట దెబ్బతినకూడదనే ఉద్దేశంతోనే తాను స్వయంగా విశాఖపట్నంలోని సీబీఐ కార్యాలయానికి వెళ్లి విచారణ చేయాలని లేఖ ఇచ్చినట్లు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే రాచమల్లు మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని దెబ్బతీసేందుకు తెలుగుదేశం పార్టీ నాయకులు చౌకబారు విమర్శలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నారా లోకేష్ తనను బెట్టింగ్ రెడ్డి అని విమర్శించడాన్ని తాను తట్టుకోలేక పోతున్నాన్నారు. వరదరాజులరెడ్డి, లింగారెడ్డి, కొవ్వూరు రామసుబ్బారెడ్డి లాంటి నేతలెందరో ఎన్నికల్లో పోటీ చేశారని, వారెవరూ ఇలాంటి వ్యక్తిగత విమర్శలను ఎదుర్కోలేదన్నారు. రాజకీయ జీవితంలో తనకు ప్రజల కంటే ఎవరూ ముఖ్యం కాదన్నారు. ఒకరు జన్మనిచ్చిన తల్లిదండ్రలైతే, రెండోది రాజకీయ పునర్జన్మనిచ్చిన ప్రజలేనన్నారు. చివరి శ్వాస వరకు ప్రొద్దుటూరుకు మచ్చ తెచ్చే ఏ పనిని చేయనని అన్నారు. ఎంతో నమ్మకంతో ఓట్లు వేసి ప్రజలు తనను గెలిపించారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయబోనని పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో చంద్రబాబు , ఆయన కుమారుడు నారా లోకేష్ నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని.. ఇది సరైన పద్ధతి కాదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ నేతలు ఇలాగే వ్యవహరిస్తున్నారన్నారు. ప్రజలు ఆశించిన విధంగానే ప్రొద్దుటూరు నియోజకవర్గాన్ని శాంతియుత వాతావరణంలో ఉంచడంతోపాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తానన్నారు. ఇందులో భాగంగానే ప్రొద్దుటూరులో ఆర్టీసీ బస్టాండ్, వైఎస్సార్ ఇంజనీరింగ్‌కాలేజి, బ్రిడ్జి నిర్మాణం లాంటి అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. టీడీపీ నేతల చిల్లర మాటల వల్ల పైకి అభివృద్ధి కనిపించడం లేదని తెలిపారు. 2024 ఎన్నికల్లో మరో మారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కడతారని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి పాల్గొన్నారు.

బ్రహ్మంగారి కల్యాణోత్సవాలు ప్రారంభం

బ్రహ్మంగారిమఠం : వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మహాశివరాత్రి సందర్భంగా ఈ ఉత్సవాలను ఐదు రోజులపాటు నిర్వహించనున్నారు. మొదటి రోజు ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకం, సహస్రనామార్చన తదితర కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం మఠాధిపతుల మూలపురుషులు పెద్ద గోవిందస్వామి ప్రథమ పుత్రుడు గోవింద స్వామి ధర్మపత్ని వీరపాపమాంబ వారి ఆరాధన, ద్వార పూజ చేశారు. రాత్రి కలశోత్సవం, దేవతాహ్వానం, ధ్వజారోహణం తదితర కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో పూర్వపు మఠాధిపతులు వీరభోగ వసంత వెంకటేశ్వర స్వాముల కుమారులు వెంకటాద్రిస్వామి, వీరభద్ర స్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు కల్యాణం

వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవాన్ని శనివారం రాత్రి 8 గంటలకు కమనీయంగా నిర్వహించనున్నారు. అనంతరం హరికథ కాలక్షేపం, నరనంది ఉత్సవ కార్యక్రమాలు ఉంటాయి. రాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలమున ఏకాదశ రుద్రాభిషేకం (జాగరణ) నిర్వహిస్తారు.

ఈశ్వరీదేవి మఠంలో..

ఈశ్వరీదేవి మఠంలో మహాశివరాత్రి కల్యాణ మహోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి అమ్మవారికి విశేష పూజలు చేసి, భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం పురాణ కాలక్షేపం కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో మఠాధిపతులు వీరశివకుమారస్వాములు, ఈఓ బీవీ జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. శనివారం ఉదయం పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించనున్నారు. రాత్రి టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులచే హరికథా కాలక్షేపం, రాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలమున ఏకాదశ రుద్రాభిషేకం కార్యక్రమం నిర్వహించనున్నారు.

మల్లెంకొండకు చేరుకుంటున్న భక్తులు

గోపవరం : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శనివారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే మల్లెంకొండేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు శుక్రవారం నుంచే భక్తులు మల్లెంకొండకు చేరుకుంటున్నారు. ఈ బ్రహ్మోత్సవాలకు వైఎస్సార్ జిల్లాతో పాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాల నుంచి భక్తులు వస్తారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల కోసం బద్వేలు ఆర్టీసీ డిపో వారు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. కొండ దిగువ భాగం వరకు వాహనాల్లో చేరుకున్న భక్తులు అక్కడి నుంచి దాదాపు 7 కిలోమీటర్ల మేర కాలినడకన కొండపైకి ఎక్కి వెళుతున్నారు. దాదాపు 25 వేల నుంచి 30 వేల మంది వరకు ఈ బ్రహ్మోత్సవాలకు భక్తులు వస్తారని అధికారుల అంచనా. భక్తుల కోసం ఆలయ కమిటీ, దేవాదాయశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. వచ్చిన భక్తులకు కొండమీద, దిగువ భాగాన వైద్యాధికారి ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బద్వేలు రూరల్ ఎస్‌ఐ చంద్రశేఖర్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

వాటర్ ప్లాంట్‌పై విజిలెన్స్ అధికారుల దాడులు

మైదుకూరు/బ్రహ్మంగారిమఠం : మైదుకూరు, బ్రహ్మంగారిమఠంలో శుక్రవారం విజిలెన్స్ అధికారులు ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్లపై దాడులు నిర్వహించారు. మైదుకూరులోని శ్రీలక్ష్మి శ్రీనివాస వాటర్ ప్లాంట్, బి.మఠంలో తనిఖీలు నిర్వహించిన విజిలెన్స్ అధికారులు ప్లాంట్లలోని లోటుపాట్లపై నివేదికలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు. దాడుల్లో విజిలెన్స్ అధికారులు విష్ణు, ఇదుర్ బాషా, అశోక్, జనార్దన్, నాయక్ పాల్గొన్నారు. కాగా ఫుడ్ సేఫ్టీ అధికారి షంషీర్‌ఖాన్, ప్లాంట్ల నీటి నాణ్యత పరీక్షల కోసం నీళ్ల ప్యాకెట్లను, బాటిళ్లను సేకరించి హైదరాబాద్‌లోని లాబరేటరీకి పంపుతున్నట్టు తెలియజేశారు.

ప్లాన్ అప్రూవల్‌పై అవగాహన కలిగి ఉండాలి

ప్రొద్దుటూరు : గ్రామ పంచాయతీలకు సంబంధించి ప్రజలు దరఖాస్తు చేసుకునే ప్లాన్ అప్రూవల్‌పై సచివాలయ ఉద్యోగులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ నందన్ తెలిపారు. జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్ పరిధిలోని గ్రామ పంచాయతీల కార్యదర్శులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నందన్ మాట్లాడుతూ పంచాయతీల్లో 300 చదరపు మీటర్లకంటే తక్కువ వైశాల్యం ఉన్న బిల్డింగ్ ప్లాన్ అనుమతి ప్రక్రియకు సంబంధించి ఎంట్రో ల్యాబ్స్ వారిచే డెవలప్ చేసిన వెబ్ అప్లికేషన్ గురించి తెలుసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ప్లానింగ్ ఆఫీసర్ పి.శైలజ, ఏపీఓలు ఆసిఫ్, కృష్ణ సింగ్, డీఎల్‌పీఓ విజయభాస్కర్, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

శనగలను మార్క్ ఫెడ్ కొనుగోలు చేస్తుంది

రాజుపాళెం : శనగ ధాన్యాన్ని ప్రభుత్వమే మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తుందని ట్రైనీ కలెక్టర్ ప్రశాంత్ రైతులకు సూచించారు. మండలంలోని చిన్నశెట్టిపల్లె గ్రామంలోని రైతు భరోసా కేంద్రాన్ని శుక్రవారం సాయంత్రం ఆయన సందర్శించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో శనగ ధాన్యానికి తక్కువ ధర ఉందని, మార్క్ ఫెడ్ ద్వారా క్వింటాలు రూ.5335 మద్దతు ధరతో కొనుగోలు చేస్తామన్నారు. అందుకోసం రైతులు రైతు భరోసా కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

పశువుల సంత ఆదాయం పెరిగింది


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

మైదుకూరు : మైదుకూరులోని పశువుల సంత ఎంతో అభివృద్ధి చెందిందని, మార్కెట్ కమిటీకి సంత ద్వారా వచ్చే ఆదాయం పెరిగిందని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తెలిపారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో శుక్రవారం మార్కెట్ కమిటీ అభివృద్ధిపై సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ గౌరవ చైర్మన్‌గా ఉన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో సంత నిర్వహణకు సరిపడా స్థలం లేక బయటనే పశువుల క్రయ విక్రయాలు జరిగేవన్నారు. దాని వల్ల కమిటీకి ఆదాయంలో గండి పడేదని తెలిపారు. గత డిసెంబర్ 10న సంతను బద్వేలు రోడ్డులోని ముక్కొండ వద్దకు మార్చిన తర్వాత రైతుల అవసరాలకు సరిపడా స్థలం దొరికిందని పేర్కొన్నారు. గత నవంబర్‌లో పశువుల సంత ద్వారా మార్కెట్ కమిటీకి రూ.1.86 లక్షల ఆదాయం రాగా, డిసెంబర్‌లో 1.96 లక్షలు వచ్చిందన్నారు. ఈ ఏడాది జనవరిలో రూ.3.35 లక్షల ఆదాయం వచ్చిందని, దీనిని బట్టి సంత అభివృద్ధి చెందుతోందనడానికి పెరిగిన ఆదాయమే నిదర్శనమన్నారు. పశువుల సంతపై దుష్ప్రచారం చేసే వారికి ఇదే సమాధానమని తెలిపారు. సమావేశంలో నవంబర్, డిసెంబర్, జనవరి నెలల్లో మార్కెట్ కమిటీ ఆదాయ, వ్యయాలపై సమీక్షించారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణ రెడ్డి, వైస్ చైర్మన్ చెంద్రాయుడు, ఏఎంసీ కార్యదర్శి మనోహర్, మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, సింగిల్ విండో చైర్మన్ మూలె సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి అభివృద్ధికి చర్యలు

మైదుకూరులోని సామాజిక ఆస్పత్రి అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆస్పత్రి అభివృద్ధిపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. వైద్యాధికారి ఎస్.కరీముల్లా, వైద్యులు మన్సూర్, రవి, అభివృద్ధి సలహా కమిటీ సభ్యుడు నరసింహులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి కృషి

చాపాడు : అంగన్వాడీ కేంద్రాలలో పని చేసే అంగన్వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అంగన్వాడీ వర్కర్లు శుక్రవారం తమ సమస్యల పరిష్కరించాలని ఎమ్మెల్యేను కలిసి వినతి చేశారు. స్పందించిన ఎమ్మెల్యే జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ రాణితో ఫోనులో మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

పంటల పరిశీలన

పోరుమామిళ్ల : మండలంలోని పుల్లివీడు గ్రామంలో మిరప పంటను శుక్రవారం ఉద్యానశాఖాధికారి శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు పంటలపై విచక్షణా రహితంగా పురుగు మందులు వాడటం వల్ల చెడు ప్రభావం చూపుతుందని, దీర్ఘకాలంలో ఆ పరిణామంతో రైతులు నష్టపోతారని, సిఫార్స్ చేయని, ధృవీకరింపబడని బయో మందుల వాడకం వల్ల పంటలపై చెడు ప్రభా వం చూపుతుందన్నారు. ఒకేసారి మూడు నాలుగు మందులు కలిపి పిచికారి చేయడం మంచిది కాదన్నారు. కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకులు సునీల్, తహసీన్, మహేష్, హాలి రైతులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా నిలవడం గొప్ప విషయం

బద్వేలు అర్బన్ : సాంఘీక సేవా సంస్థ ఆధ్వర్యంలో క్యాన్సర్, టీబీ బాధితులకు అండగా నిలవడం గొప్ప విషయమని ఐర్లాండ్ దేశస్తురాలు ఆన్‌క్యారల్ అన్నారు. స్థానిక మైదుకూరు రోడ్డులోని మదర్‌థెరిసా ప్రార్థనాలయంలో కడప డయాసిస్ సాంఘీక సేవా సంస్థ డైరెక్టర్ రెవ.ఫాదర్ తలారి బాలరాజు ఆధ్వర్యంలో విచారణ గురువులు రెవ.ఫాదర్ ఆరోగ్యరాజు అధ్యక్షతన శుక్రవారం క్యాన్సర్, టీబీ బాధితులతో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. కడప, అన్నమయ్య, చిత్తూరు, కర్నూలు జిల్లాల్లో సంస్థ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సంస్థ తరపున చేస్తున్న సేవా కార్యక్రమాలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జోత్స్నస్వర్ణలత మాట్లాడుతూ క్యాన్సర్, టీబీ వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన వైద్యం పొందితే ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చన్నారు. అనంతరం క్యాన్సర్ బాధితులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మున్సిపాలిటీ కన్వీనర్ యద్దారెడ్డి, కౌన్సిలర్లు చెన్నయ్య, సునీత, క్షయవ్యాధి నివారణ అధికారులు శ్రీనివాసులు, ప్రసాద్, సంస్థ కో ఆర్డినేటర్లు బాలశౌరి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.


క్యాన్సర్ బాధితులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఐర్లాండ్ దేశస్థురాలు, సంస్థ నిర్వాహకులు

ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులకు అవగాహన

దువ్వూరు : మండల పరిధిలోని పుల్లారెడ్డిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం దువ్వూరు ఆంధ్రప్రగతి గ్రామీణబ్యాంకు శాఖ మేనేజర్ ఎన్.శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పొదుపు ప్రాధాన్యత, ఆన్‌లైన్ బ్యాంకింగ్, డిజిటల్ లావాదేవీల నిర్వహణపై వివరించారు. అనంతరం కళాజాత బృందంతో బ్యాంకు అందిస్తున్న సేవలను, సదుపాయాలను అందరికి అర్థమయ్యేలా తెలియజేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ రామాంజనేయ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అహల్యాబాయి, ఉపాధ్యాయులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

మెయిన్ బజార్‌లో సమస్యలను పరిష్కరిస్తాం

ప్రొద్దుటూరు : మెయిన్ బజార్‌లో వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి తెలిపారు. వార్డు కౌన్సిలర్ కొవ్వూరు స్వాతి చైతన్యరెడ్డి, ప్రముఖ వ్యాపార వేత్త బుశెట్టి రాజశేఖర్ మెయిన్ బజార్ సమస్యలను వైస్ చైర్మన్‌కు తెలిపారు. దీంతో ఆయన శుక్రవారం ఉదయం బంగారంగళ్ల వీధిలో పర్యటించి రోడ్లు, డ్రైనేజి కాలువల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కసిరెడ్డి మహేశ్వరరెడ్డి, గురునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

గృహసారథులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


కిట్లను పంపిణీ చేస్తున్న కన్వీనర్లు మల్లికార్జునరెడ్డి, పుల్లయ్య

గోపవరం : గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మల్లికార్జునరెడ్డి, సచివాలయ కన్వీనర్ పుల్లయ్యలు తెలిపారు. శుక్రవారం మండలంలోని గోపవరం సచివాలయం పరిధిలోని గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు మా నమ్మకం నీవే జగనన్న కిట్లను పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేపట్టిన మంచి పనులను ప్రజలకు వివరించి వారిని చైతన్యపరచాలన్నారు. పార్టీలకు అతీతంగా, కులమతాలు తేడా లేకుండా జగనన్న ప్రభుత్వం అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ అందించిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. రాబోయే ఎన్నికల్లో గృహసారథులు, కన్వీనర్లు కీలకపాత్ర పోషించి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేసుకునే విధంగా పార్టీ కోసం కష్టపడి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సరస్వతి, వాటర్ బోర్డు మెంబర్ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో మెడికల్ క్యాంపులు ఉండాలి


ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ నాగరాజు

అట్లూరు : మహాశివరాత్రి సందర్భంగా శనివారం లంక మల్లేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో మెడికల్ క్యాంపులు అందుబాటులో ఉండాలని జిల్లా డీఎంఅండ్‌హెచ్‌ఓ నాగరాజు ఆరోగ్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఆయన అట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి ఆస్పత్రిలో సిబ్బంది పనితీరు, రోగుల వసతులపై ఆరాతీశారు. అనంతరం మహాశివరాత్రి సందర్భంగా శ్రీలంకమల్లేశ్వరస్వామి దర్శనార్థం భక్తులు అధిక సంఖ్యలో వస్తారని మెడికల్ క్యాంపు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి హమీదాబేగం, సీహెచ్‌ఓ మురళీకృష్ణా, అసిస్టెంటు మలేరియా అధికారి వెంకటరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.







